

# తరవాయి కథ... వొచ్చే క్షవరంలో

- ఇచ్ఛాపురపు రామచంద్రం





**ఆఫీసయిపోయింది కానీ - అవతల చినుకులు. కొంచెమయినా ఎందుకు తడవాలిలే అని కుర్చీని కిటికి వేపు తిప్పి కూర్చుని బయటకు చూస్తున్నాను. అలా చూడడం నాకిష్టం. మంచి వాతావరణం - కథలకీ, కలిసి మందు తాగడానికీ.**

కిటికీలోంచి - రోడ్డు మీద... పూల వానలో తడిసి వెళ్తున్న జనం. ఇస్నోఫీలియా సంకటం లేకపోతే నేనూ అలా ఆనందించేవాడినే. సిగరెట్ తీసి వెలిగించాను. కిటికీ లోంచి - నీలంగా పొగ బయటకు పోతూంది. అక్కడ... మూడు హెయిర్ కటింగ్ సెలూన్‌లు వరుసగా. ఒకటి హైక్లాస్... రెండోది అప్పర్ మిడిల్ క్లాస్. మూడోది మామూలుది. త్రిమూర్తుల్లా. గాంధీగారి కోతుల్లా... మూడూ వరసగా... చిత్రమేమిటంటే - ఆ మూడో దానికే ఎప్పుడూ రష్. మిగిలిన రెండూ ఎంత హంగుగా ఉన్నా వాటికి బిజినెస్ తక్కువే. ఇరవై రోజుల కిందట కాబోలు - నేనూ ఆ పని మీదే వెళ్ళవలసి వచ్చింది. విచిత్రమేమిటంటే - మిగిలిన రెండూ కాళీగానే ఉన్నా నేనూ ఆ షాపుకే తల అప్పగించాను. అతను... ఈ తలమాసిన వాడి తలపని పడుతూ - చివరలో హఠాత్తుగా... కథలాటిది చెప్పాడు, నేనడక్కుండానే... పందొమ్మిది వందల డెబ్భై ప్రాంతాలలో పెద్ద వరదలొచ్చినప్పుడు ఓ పందొమ్మిదేళ్ళ తల్లీ... పురుటి కందూ విడిపోవలసి వచ్చిందండి. ప్రవాహానికి ఇద్దరి బతుకులూ చెరో దారీ అయ్యాయి. ఆవిడ భర్త వరదలోనే చనిపోగా... బతకడానికి మరో తోవ లేక ఆ ఆడవిడ దొంగ అయింది. ఈ మధ్యనే ఓ దొంగతనంలో ఆవిడకొక అబ్బాయి కలిశాడు. ఇద్దరూ కలిసి - ఏభై వేలు కొట్టేసి... ఏమీ ఎరగనట్లు ఓ హోటలు గదిలో పడుకున్నారు. ఆ కుర్రాణ్ణి చంపేసి... అతని వాటా పాతికవేలూ కూడా కొట్టేసి - ఎప్పటికేనా దొరక్కపోతాడా అనే కొడుకు కోసం దాచాలని ఆవిడ కోరిక. మాతృప్రేమన్న మాట. కుర్రాడు గాఢంగా నిద్రపోతూంటే - ఆమె లేచి కత్తి తీసిందండి... పొడిచి చంపడానికి. ఒక్కసారి కుర్రాడి మొహం చూడాలనిపించింది. చూసింది.... అని అక్కడ కథాపి మీ పనయిపోయింది సార్... కటింగ్ ఛార్జి పది రూపాయలు అనేశాడు నేనిక వెళ్ళొచ్చునన్నట్లు. డబ్బు చెల్లించినా నా కాళ్ళు కదలనంటున్నాయి. అంతవరకూ ఎంత బాగా చెప్పాడని! సినిమా రైటర్లు ప్రొడ్యూసర్‌కో డైరెక్టర్‌కో హీరోకో హీరోయిన్‌కో వీళ్ళ వాళ్ళకో కూడా ఇంత బాగా చెప్పలేరేమో ఒక కథని.

అతను నవ్వాడు. ఆమె ఆ కుర్రాడి కన్నతల్లే అని మీరు గ్రహించేశారని నాకు తెలుసు సార్. కాని... పాయింటది కాదు. అమ్మ సెంటిమెంటు బలమెంత? ఆవిడ అతను తన కొడుకే అని గుర్తుపట్టగలిగిందా? అలా గుర్తుపట్టగలగడం - అతన్ని కత్తితో పొడిచేశాకా, పొడవక ముందేనా! ఇలాటివన్నీ తేలాలి కద సార్. ఇప్పుడు కస్టమర్లు వెయిట్ చేస్తున్నారు సర్. మీరు మళ్ళీ వొచ్చినప్పుడు... అంటూ నన్ను త్వరగా నిష్క్రమించమని సున్నితంగా తెలియజేశాక - నేనక్కడ మరో క్షణం ఎలా ఉండగలనూ?

అది కథా, వాస్తవమా? సెంటిమెంటు సకాలంలో గెలిచిందా? ఒక కన్నతల్లి కొడుకుని హత్య చేయడమనే దారుణం నివారించబడిందా లేదా? అన్నీ సందేహాలే, అంతా సస్పెన్స్. అసలతను ఆ కథ - లేదా కథలాటి వాస్తవాన్ని నాకెందుకు చెప్పాడు?

కొన్ని రోజులపాటు మెదడు నిండా కోలాహలం - కథలు రాసే నాకే. మళ్ళీ క్షవర దినంనాడు అతన్నే అడిగి తేల్చుకుందామని సరిపెట్టుకున్నాను.

ఆ షాపుని చూసేసరికింత ఫ్లాష్‌బ్యాక్ మెదిలింది మెదడులో. ఆ సస్పెన్సింకా విడనే లేదు.

సర్ - నా వెనుక నుంచి.

ఆఫీసు టైమయిపోయింది. రేపు రండి వెనక్కి చూడకుండానే చెప్పేశాను.

నేను ఆఫీసు పని మీద రాలేదండీ. పర్సనల్

వెనక్కి తిరిగి చూశాను. ఎవరో... పెద్దమనిషిలాగే ఉన్నాడు. ఎప్పుడో ఎక్కడో చూశానేమో అనే సందేహం.

కాని - గుర్తు రావటంలేదు. నా జ్ఞాపకశక్తి ఎంత గొప్పదో నాకు తెలుసు కనుక ఇక ఆ ప్రయత్నం విరమించుకుని - అతని వేపు సూటిగా చూశాను.

మీరు - విరించి గారు... కథలు రాసే విరించి గారు ఔనా అన్నట్లు చూస్తూ నమస్కరించాడు.

నేను రచయితనే అని వొప్పుకోలేకా, ఉన్నత దోషానికి వెరచీ - ఊ అని మూలిగానయిష్టంగా.

మీరు నా యందు కరుణించి నాకొక సాయం... ఉః కారం చేసి పెట్టాలి అతనింకా దణ్ణం తియ్యలేదు.

చేతిలో బ్రీఫ్‌కేసు లేదు కనుక పుస్తక ప్రచురణకర్త అనిపించడంలేదు. నాలాటి ఆఫ్టరాల్ రైటరు ముందు కూడా ఇంత వినయంగా మాట్లాడుతున్నాడంటే - సినిమా మనిషి కాజాలడు. నేనీ వూరు బదిలీ మీదొచ్చింది ఈ మధ్యనే. క్షవరానికి బార్బర్‌నే ఇంటికి రప్పించుకోగలిగే పాటి పలుకుబడి కూడా పెరగకే తల పట్టుకుని షాపుకే వెళ్ళాను, కొండ మహమ్మద్ దగ్గరకి రాకపోతే మహమ్మదే కొండ దగ్గరికి వెళ్ళాలనే నీతి సూత్రం నెమరేసుకుని.

ఇతను - వర్ధమాన రచయితేమో? కథలు పరిశీలించడమో సరిదిద్దడమో చేయమంటాడేమో... నేను అతి సామాన్య రచయితని. కచ్చితంగా కథ రాయడం నాకే చేతకాదు. ఈ కుక్కతోక పట్టుకుని కథాసాగరాన్నీదబోవడం ఎంత మాత్రమూ నీకు మేలు చేయదు అని చెప్పెయ్యాలనుకున్నాను కానీ - మాటలని పొదుపు చేయడం జాతీయ సంపదని పొదుపు చెయ్యడమే అనే ప్రభుత్వోక్తి; ఏ పుట్టలో ఏ పాముందో - అసలే ఈ వూరు నాకు కొత్త అనే సందేహమూ, అపరచితులతో అతితక్కువ మాత్రమే మాట్లాడే నైజమూ - ఈ మూడు కారణాలుగా నేను ముభావంగా

## ఈ వారం కథ

ఉండిపోయాను. నా మౌనాన్నతను నే నాశించినట్లు అర్ధానంగీకారంగా కాక అర్ధాంగీకారంగా తీసుకున్నట్లుంది. రండి... ప్లీజ్... అన్నాడు మొహమాట పెట్టేస్తూ. ఎక్కువ దూరమేమీ వెళ్ళక్కర్లేదు. గొడుగుంది, తడవక్కర్లేదు. రండి... కాదనకండి అంటూ బలవంతం చేసేసరికి - కాదని జయించలేనని తెలిసిపోయి కదలడమే నయమనిపించి... లేచాను. కథ రాసి శాన్నాళ్ళయింది, ప్లాటేదయినా దొరుకుతుందేమో అన్న చిన్న ఆశ కూడా నాలో లేకపోలేదు. అతను ఛత్రపతియ్యై నన్ను తీసుకెళ్ళసాగాడు. ఊరికే నడవడమెందుకని... లేదా... నడుస్తూ ఊరికే ఉండడమెందుకని... అతనెవరా అని మెదడుకి పదును పెట్టసాగాను. ఉద్యోగరీత్యా కూడా ఎక్కువ మందిని చూడాలి, చూసిన వాళ్ళని చూడకుండా... మనుషులతో మొహం మొత్తేంతగా... అంచేత - జ్ఞాపకం రాలేదు. కాని - నడకలో - బారు వొచ్చింది. అంతవరకూ వొచ్చాక అభ్యంతరం చెప్పడం మర్యాద కాదని అతని వెంటే నడిచి అతని కెదురు కుర్చీలో (ఉహు. అతనే నా ఎదురు కుర్చీలో కూర్చున్నాడు) కూర్చున్నాను.

వర్షం పడేటప్పుడు రమ్ రంజుగా ఉంటుందనిపించే నా టేస్ట్‌ని పసికట్టినట్లతను. అదే చెప్పాడు. ఉపద్రవంగా కోక్... మధ్యేమధ్యే కబాబులు... సిగరెట్లు సరేసరి. రెండో రౌండులో విషయానికొచ్చేశాను.

గురువుగారూ! నేను టెన్త్ పాసయ్యాను కానీ... కమేలా ఉద్యోగానిక్కూడా కంప్యూటర్ డిప్లొమా ఉందా అని అడుగుతున్న ఈ రోజులనిబట్టి నేను చదువుకొనని వాడికిందే జమ. చేదుగా ఉన్నాయీ నిజాన్నీ, కులవృత్తికి సాటిరావు గువ్వల చెన్నా అనే నీతి పద్యపాదాన్నీ అంగీకరించి - వృత్తిని చేపట్టాను. ఇదుగో సిగరెట్... అంటూ ఇచ్చి అగ్గిపుల్ల కూడా గీసి అందించాడు.

థాంక్స్ అన్నాను - అతను నన్నుద్యోగం అడిగేవాడు కాదని, కమేలా అంటే జంతు వధశాలట.

మీకు తెలియందేముంది, రచయితలు... ఇవాళ అన్నింటిలోనూ విపరీతమయిన పోటీయే

ఔనౌను. బ్లౌస్‌పీస్ కొంటే శారీ ఫ్రీ... చెంచా కొంటే గిన్నె ఫ్రీ... అండర్‌వేర్ కుట్టించుకుంటే షర్ట్ ఫ్రీ... అలాగ. ఇక డిస్కౌంట్ల సంగతి చెప్పనే అక్కర్లేదు. అప్పడాల మీద కూడా ఆరువందల శాతం డిస్కౌంటే. ఓ సినిమా టికెట్ కొంటే ఆ కుర్చీ ఫ్రీ... నాలోని రమ్ము ముభావాన్ని మూలమూలకి తరిమేస్తూంది.

బాగా చెప్పారు. క్షవరానికి గెడ్డం ఫ్రీ రోజులు పోయి... స్నానికి క్షవరమూ మాలిష్ కూడా ఫ్రీ రోజులు వొచ్చిపడ్డాయి. మల్టీనేషనల్ కంపెనీలు... వరల్డ్ బ్యాంక్, ఐఎంఎఫ్... కన్స్యూమరిజం... ఆశ్చర్యపోకండి. నేను పేపరూ చదువుతాను. నవల్సూ, మాగజీన్లూ చదువుతాను... రమ్ వేస్తానేం?

వెరీ గుడ్... రమ్మే కాదు, నువ్వవన్నీ చదవడం కూడాను. నువ్వే చెప్పదలచుకున్నా నిర్భయంగా నిస్సంకోచంగా చెప్పు... కబాబేదీ? థాంక్స్ చూడూ... ఇవాళ నాకాగస్టు పదిహేను. యస్. మా ఆవిడా పిల్లలూ ఊరికి పోయారు. నాకు స్వతంత్రమిచ్చేసి ఆఫ్‌కోర్స్... రేపటి వరకే. మగాడు పెళ్ళయినా కూడా స్వతంత్రంగా ఉండొచ్చు స్మీ అప్పుడప్పుడు... రైట్... చెప్పు... సిగరెట్...


మీరు పెద్ద మనసుతో వినాలి మరి... తన సిగరెట్‌తో నా సిగరెట్ అంటించాడు. మీ ఆఫీసెదురుగా ఉండే మూడు హెయిర్ కటింగ్ సెలూన్లలోనూ నాదొకటి

ఏది? ఆ ఏ/సి హెయిర్ స్టయిల్సా? ఐతే నీ లెవెల్ పెద్దదే

కాదండి. ఆ అతి సామాన్యమయిన క్షౌరశాల... అతని కంఠంలో దైన్యం... నా నిరాడంబర క్షవరశాలలో ట్యూబ్ లైట్ లేదు, ఫ్యాన్ లేదు, టీపాయ్ లేదు, దాని మీద దినపత్రికలూ బూతు పుస్తకాలూ లేవు... గోడలకి... అదే బడ్డీ చెక్కలకి సెక్సీ కాలెండర్లూ బొమ్మలూ తగిలించబడజాలవు. టీవీ లేదు. స్టీరియో లేదు...

నెవర్‌మైండ్... డోంట్‌వారీ. ఐనా నీ షాపు వేంకటేశ్వర స్వామి కళ్యాణకట్టలో నిత్య మాసినతంతో పచ్చగెడ్డాలే! అన్నట్లు ఆ మధ్య నేనూ ఓసారి నీ ముందు తలొంచిన వీరుడినే. నీ అరకథ విన్నవాడినే. నేను నిన్ను గుర్తుపట్టలేకపోయానంటే మీనింగూ రీజనూ ఉన్నాయి. కాని... నువ్వేమిటోయ్... కృతఘ్నుడివై... నీ చేత్తో కోసిన తలనే మరచిపోయావ్? కబాబ్ తెమ్మను... చాలా బాగుంది

వొస్తుంది గురూ! శతకోటి బోడిలింగాల్లో ఇదొకటి అన్నట్లు సవాలక్ష మాసిన తలలో మీదొకటి. అందర్నీ... అన్ని తలలనీ గుర్తుపెట్టుకుందామనుకుంటే బ్రెయిన్ బరస్టయిపోతది. కటింగయిపోగానే వెంట్రుకలనీ ఆ వ్యక్తినీ తుడిచీడమే నా ఆరోగ్య సౌందర్య రహస్యం. ఏదేమయినా మీ పట్ల జరిగిన పొరపాటుకి చింతిస్తున్నాను...



నోరిగ్రెట్స్... కమాన్... చెప్పు. ఏదో సాయం కావాలన్నావు? మందు నన్ను తాగడానికింక ఆట్టే దూరం లేదు. ఇంతవరకూ నను మందుని తాగాను కనుక - ఇక అది నన్ను తాగడం న్యాయమే.

నన్ను నేను పొగుడుకుందుకు నేను సినిమావాడినీ కాను, రాజకీయ నాయకుడినీ కాను. అయినా నిజం చెప్పాలి కనక తప్పడంలేదు. నేను మంచి బార్బర్‌ని. నేను చేసే ఛార్జిలు తక్కువ. నా దగ్గరకు వొచ్చే కస్టమర్లను నిలిపి ఉంచుకుందుకు నేనొక ఉపాయం ఆలోచించాను. పూర్వం రాజుగారికి క్షురకర్మ చేస్తూ మంత్రి అలియాస్ బార్బర్ చాలా విషయాలు చెప్పేవాడుట. అవి వినడం కోసమే రాజుగారు అనుదిన క్షురకర్మ గావించుకునే వారన్నా అతిశయోక్తి కాదుట. ఆ కిటుకునే అమలుపరుస్తూ... నేను క్షవరానికొచ్చిన వారికి వారి లెవెల్‌నిబట్టి కథ చెబుతూంటాను. సగంలో ఆపేసి సస్పెన్సులో పెట్టేస్తాను. మళ్ళీసారొచ్చినప్పుడు తరవాత సగం చెబుతానంటాను... ఆశ్చర్యపోయాను. కథలకి ఇలాటి ప్రయోజనం కూడా ఉందా?! ఉద్దండుడే ఇతను.

సస్పెన్సు కతలతో క్షవరాలు పండిస్తున్నాడు.

తరవాయి కథ వొచ్చే క్షవరం మీద ఔనా? రెండు క్షవరాలకీ ఓ కథ? నవ్వాను.

సరిగ్గా అంతే. గెడ్డానికయితే జోక్. అవతలి తలనిబట్టి బూతు జోకులు కూడా చెబుతాను. హెయిర్ కటింగ్ సెలూన్ పాతా, లాండ్రీ కొత్తా - అనే సామెతుంది కదా? నాలుగుసార్లు కస్టమర్లు నా దగ్గరకొస్తే ఇక వాళ్ళు నాకు పర్మనెంటయినట్లే. వాళ్ళని నాలుగుసార్లు రప్పించుకోవాలంటే కొత్తకొత్త సస్పెన్సు కథలుండాలి. కొత్తకొత్త జోకులుండాలి. నేను మీ సహాయ సహకారాలర్థించేదీ విషయంలోనే అంటూ నా గ్లాసులో రమ్, కోక్ వేసి - మీరు రాసినవేనా ఫర్లేదు, మరెవరు రాసినవేనా ఫర్లేదు. సస్పెన్సున్న కథలు... సోషల్, క్రైం, డిటెక్టివ్, సెక్స్... జానపదం... చారిత్రాత్మకం - ఏవయినా ఫరవాలేదు. మీరు నాకిస్తూండాలపుడప్పుడు. అలాగే జోకుతాను. నిలవ కథలూ పాత జోకులూ వ్యాపారానికి మంచి చేయవు కదా? నాది హెయిర్ కటింగ్ సెలూన్ తప్ప తెలుగు సినిమా కాదుగా పాడిందే పాడడానికీ చెప్పిందే చెప్పడానికీ?

ఔను... గ్లాసు నింపు...

ఇవి - కాళ్ళు కావు సర్. చేతులు. నేను మీ రుణం ఉంచుకోను సర్. మీరు కబురంపడమే తడవు, ఇంటికొచ్చి - హెయిర్ కటింగ్, షేవింగ్, మాలిష్‌లలో ఏ వొక్కటి కాని... కొన్ని కాని... అన్నీ కాని ఉచితంగా చేస్తానని రమ్ము మీద ప్రమాణం చేస్తున్నాను సర్. ప్లీజ్... అంటూ అతను నా చేతులు పట్టుకున్నాడు.

డైలాగ్ చాలు. యాక్షనక్కరలేదు. ఆల్‌రైట్... నేను మాటిస్తున్నాను మందు సాక్షిగా. నీకు నెలకోసారి ఏడు కొత్త కథలూ ఎనిమిది జోకులూ చెబుతూంటా నీ వూళ్ళో ఉన్నన్నాళ్ళూ... ఓకే?

థాంక్యూ సర్. థాంక్యూ వెరీమచ్ సర్. మీరు రచయిత రూపంలో ఉన్న రాముడే సార్

చాలు. ఈ రైటర్ రాముడికి రిక్షాని పిలువ్

నేనూ - మీ కంపెనీ కోసమని కొంత తాగబట్టికాని - లేకపోతే నా భుజాల మీదెక్కించుకుని తీసుకువెళ్ళను సార్... నెక్స్ట్ టైమ్ బెటర్‌లక్ ఫర్ మి... అంటూ - బిల్ చెల్లించేసి - రిక్షా తెప్పించాడతను. గృహమే కదా నిద్రసీమ - అని పాడుకుంటూ రిక్షా ఎక్కాను. మనిషి భుజాల కంటె రిక్షా సీటే సుఖంగా మెత్తగా ఉంది - ఎముకలూ కంపూ లేకుండా.

మర్నాడు లేచేసరికి - రాత్రి జరిగింది నిజమా కలా? అన్న సస్పెన్స్. ★

